బ్రహ్మోత్సవాలకు ఆలయం ముస్తాబు

- రేపటి నుంచి 12వ తేదీ వరకు వేంకటేశ్వర దేవాలయంలో ఉత్సవాలు
- భక్తుల సౌకర్యార్థం భారీ ఏర్పాట్లు

కాజీపేట: కాజీపేట పట్టణం చైతన్యపురి కాలనీలోని పద్మావతి, గోదా సమేత వేంకటేశ్వరస్వామి ఆలయం.. 23వ బ్రహ్మోత్సవ వేడుకలకు అందంగా ముస్తాబవుతోంది. ఈనెల 7నుంచి 12వ తేదీ వరకు వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య బ్రహ్మోత్సవాలు ఘనంగా జరగనున్నాయి. నగరం నలుమూలల నుంచి వెంకన్న ఉత్సవాలకు భక్తులు హాజరవుతారు. వార్షిక బ్రహ్మోత్సవాల నిర్వహణ కోసం ఆలయంలో తగిన ఏర్పాట్లు చేయడంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు శ్రమిస్తున్నారు.

ప్రత్యేక పూజలు.. ఆలయ ప్రత్యేకత

నిట్ ఎదురుగా ఉన్న చైతన్యపురి కాలనీలో పేదల తిరుపతిగా పిలువబడే ఈ ఆలయంలో భక్తులు నిత్యం విశేష పూజలు నిర్వహిస్తుంటారు. ఆలయంలో కుంకుమ పూజలు, సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు, అన్నమాచార్య సంగీత కచేరీలు వంటివి నిర్వహించడం ఈ ఆలయం ప్రత్యేకత. ఆలయం ముందు భాగంలోని స్వాగత తోరణం చైతన్యపురి కాలనీకే ప్రత్యేక శోభగా నిలిచింది.



చైతన్యపురి కాలనీలోని స్వాగత తోరణం



ఆలయంలో కొలువుదీరిన దేవతామూర్తులు

ఆలయం వద్ద విశాల వసతులు, మండపం ప్రత్యేక గదులు ఏర్పాటు చేశారు. ఆలయ ఆవరణలో అడుగిడగానే భక్తిపారవశ్యంతో భక్తులు తన్మయత్వం చెందేలా పచ్చని మొక్కలు, అందమైన గార్డెన్, ఫౌంటెన్లు కనువిందు చేస్తాయి.



ఆలయంలో ఏర్పాటు చేసిన ఏడు వైకుంఠ ద్వారాలు

బ్రహ్మోత్సవాల వివరాలు

బ్రహ్మోత్సవాల వివరాలను ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు పంజాల అశోక్ కుమార్ గౌడ్, కెప్టెన్ వడ్డెపల్లి నరేందర్ తెలిపారు. శ్రీమాన్ నల్లాన్ చక్రవర్తుల రఘునాథచార్యుల ఆధ్వర్యంలో ఉత్సవాలు జరగనున్నాయి. 7న స్వస్తి వాచనం, విష్వక్సేనారాధన, రక్షాబంధనం, అంకురార్పణ, 8న ధ్వజారోహణం, దేవత ఆహ్వానం, లక్ష్మి అర్చన, 9న పూలంగి సేవ, అలివేల మంగమ్మ వేంకటేశ్వరస్వామిల కల్యాణం, 10న హోమం, గరుడసేవ, 11న సహస్ర నామార్చనలు, డోలోత్సవం, 12న పూర్ణాహుతి, శ్రీచక్రస్నానం, ముగింపు ఉత్సవాలుంటాయని ఆలయ పూజారి రఘురామాచార్యులు వివరించారు.

'వసూల్ రాజా'పై అధికారుల విచారణ

- స్పందించిన పశుసంవర్ధక శాఖ అధికారి

హసన్‌పర్తి: హసన్‌పర్తి పశువైద్యాధికారి వ్యవహారంపై జిల్లా పశుసంవర్ధక అధికారి విజయభాస్కర్ బుధవారం విచారణ చేపట్టారు. వసూల్ రాజా అనే కథనం 'సాక్షి'లో బుధవారం ప్రచురితం కాగా, రైతులను అధికారులు విచారించారు. సదరు వైద్యుడు ప్రతీ చికిత్సకూ డబ్బులు డిమాండ్ చేస్తున్నారని ప్రజలు తెలిపారు. గాలికుంటు వ్యాధి నిరోధక టీకాకు కూడా డబ్బులు అడుతున్నాడని అన్నారు. మూగ జీవాలకు ఉచితంగా వేసే ట్యాగింగ్‌కు కూడా ఒక్కో పశువుకు రూ.వంద చొప్పున వసూలు చేశాడని రైతులు వాపోయారు. కార్యక్రమంలో ఏడీ డాక్టర్ పి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. కాగా, అవినీతికి పాల్పడుతున్న పశువైద్యాధికారి క్రాంతికుమార్‌పై చర్యలు తీసుకోవాలని స్థానిక కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్ కోరారు.

సాక్షి స్పందన



రైతులతో మాట్లాడుతున్న విచారణాధికారి

కేయూ విద్యా కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా ప్రొఫెసర్ మనోహర్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ విద్యా కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా హిస్టరీ అండ్ టూరిజం మేనేజ్‌మెంట్ కళాశాల ప్రొఫెసర్ మనోహర్ నియామితులయ్యారు. ఈమేరకు కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రామచంద్రం బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. అలాగే, కాకతీయ యూనివర్సిటీలోని మహిళా ఇంజనీరింగ్ కళాశాల ప్లేస్‌మెంట్ కెరీర్ అండ్ కౌన్సెలింగ్ సెల్ ఆఫీసర్‌గా కళాశాల సీఎస్‌ఈ విభాగం కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ కిరణ్‌కుమార్, కేయూ కో ఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ కళాశాల ప్లేస్‌మెంట్ కెరీర్ కౌన్సెలింగ్ సెల్ ఆఫీసర్‌గా సీఎస్‌ఈ విభాగం కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ రమణబాబును నియమించారు.

సామాజిక సేవ చేయాలని ఐదుగురికి కోర్టు ఆదేశం



కాజీపేట: మద్యం తాగి వాహనాలు నడుపుతూ ట్రాఫిక్ పోలీసులకు పట్టుబడిన ఐదుగురు వ్యక్తులకు జిల్లా రెండో తరగతి కోర్టు న్యాయమూర్తి రెండు రోజుల పాటు సామాజిక సేవ చేయాలని బుధవారం తీర్పునిచ్చారు. కాజీపేట ట్రాఫిక్ సీఐ నాగబాబు కథనం ప్రకారం పట్టణంలో పోలీసు సిబ్బంది డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేపట్టగా కలకోట్ల కల్యాణ్, గోవింద రాజు, గన్నారపు శివకుమార్, కన్నెబోయిన నాగరాజు, జరుపుల బాలు.. మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వారిని కోర్టులో హాజరుపర్చగా సమాజ సేవ చేయాలని న్యాయమూర్తి ఆదేశించారు. మున్సిపల్ కార్యాలయంలో వారిని అప్పగించగా పారిశుద్ధ్య పనులు అప్పగించినట్లు సీఐ తెలిపారు.

పాడిరైతులను భాగస్వాములు చేయండి



పుష్పగుచ్ఛం అందజేస్తున్న దేవేందర్‌రావు

హన్మకొండ చౌరస్తా: విజయ డెయిరీ ఆవిర్భావంలో రూపొందించుకున్న బైలా ప్రకారం డెయిరీ అభివృద్ధిలో పాడిరైతులను భాగస్వాములుగా చేయాలని కాకతీయ విజయ పాడిరైతుల సంక్షేమ సంఘం ప్రతినిధులు కోరారు. ఈమేరకు హైదరాబాద్‌లో వ్యవసాయ రైతుల సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి, సభ్యులు కేవీఎన్.రెడ్డి, సునీల్, భవానిలను బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షుడు ఇరుకు దేవేందర్‌రావు మాట్లాడుతూ బైలా ప్రకారం గ్రామ స్థాయిలో సొసైటీలు, జిల్లా స్థాయిలో రైతు యూనియన్, రాష్ట్రంలో ఫెడరేషన్ ఏర్పాటు చేస్తూ, డెయిరీ అభివృద్ధిలో రైతులను భాగస్వాములను చేయాలని అన్నారు. దశాబ్దకాలంగా రైతులు కేవలం వినియోగదారులుగానే మిగిలిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా స్థాయిలో రైతు యూనియన్లను బలోపేతం చేస్తేనే డెయిరీలు మరింత అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు.

బెనిఫిట్స్ చెల్లించేలా చర్య తీసుకోండి

హన్మకొండ చౌరస్తా: హనుమకొండలోని శ్రీరస్తు, కల్యాణలక్ష్మి షాపింగ్ మాళ్లలో పనిచేసిన కార్మికులకు చట్టపరంగా రావాల్సిన బెనిఫిట్స్ వచ్చేలా చర్య తీసుకోవాలని ఏఐటీయూసీ నాయకులు కోరారు. ఈమేరకు కలెక్టరేట్‌లోని కార్మికశాఖ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ వర్షప్రియకు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ 38ఏళ్లుగా ఆయా షాపింగ్‌మాళ్లలో 100 మంది కార్మికులు వివిధ కేటగిరీలలో పనిచేసినట్లు తెలిపారు. గతేడాది అక్టోబర్ నుంచి ఆ దుకాణాలు తెరవడం లేదని వినతిలో పేర్కొన్నారు. ఏఐటీయూసీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు వేల్పుల సారంగపాణి, కార్మికులు దేవా, సురేష్, వెంకటేశ్వర్లు, నవీన్, అమీద్‌అలీ, రాజేష్‌ఖన్నా, సురేష్, ప్రవీణ్, రమేష్, మహేందర్, యాదగిరి, సదానందం పాల్గొన్నారు.



వర్షప్రియకు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

ఘనంగా స్వయంపాలన దినోత్సవం



విద్యార్థులతో ఉపాధ్యాయులు

వరంగల్: వరంగల్ 3వ డివిజన్ పైడిపల్లిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో స్వయం పాలన దినోత్సవాన్ని హెచ్ఎం ఎస్.రవీందర్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మ ఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్‌గా బి.తేజశ్రీ, హెచ్ఎంగా జన్మిషిత్, ఉపాధ్యాయులుగా మనీషా, నిశాంత్, సామ్రాట్, బిట్టు, జైనిత్, సంతోష్‌కుమార్, అనిరుద్, ఆరోహి, నిహారిక, రుషి, నందిత, రుత్విక్, సాత్విక్ వ్యవహరించి 1నుంచి 5వ తరగతి వరకు మొత్తం 18 సబ్జెక్టులను తోటి స్నేహితులకు బోధించారు. ముఖ్యఅతిథిగా కాంప్లెక్స్ పీజీహెచ్ఎం టి.వెంకన్న పాల్గొని ఉపాధ్యాయులుగా వ్యవహరించిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పి.శ్రీరాములు, వై.కృష్ణమూర్తి, ఎస్.పద్మ, ఎం.వసంత, జి.శ్రీను, కే.అనిత, ఆనంద్ పాల్గొన్నారు.

విద్యతో పాటు విలువలు నేర్పిస్తున్నాం

హన్మకొండ: విద్యార్థులకు విద్యతో పాటు విలువలు నేర్పుతున్నట్లు శ్రీనివాస్ గురుకుల్ హైస్కూల్ సెక్రటరీ చిదురాల సోమరత్నం అన్నారు. హనుమకొండలోని అంబేద్కర్ భవన్‌లో బాలసముద్రంలోని శ్రీనివాస్ గురుకుల్ హైస్కూల్ వైబ్స్ కార్యక్రమం బుధవారం రాత్రి జరిగింది. ఈ సందర్భంగా సోమరత్నం మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగిఉన్న నైపుణ్యాలను వెలికి తీసేందుకు అనేక కార్యక్రమాలు చేపడున్నామని తెలిపారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ప్రిన్సిపాల్ యుగందర్, గణిత ఉపాధ్యాయులు శ్రీనివాస్, ఇంద్ర, ఉపాధ్యాయులు వినయ్‌కుమార్, విజయ్‌కుమార్, మధు, హఫీజ్, రజనీకాంత్, ప్రసాద్, అస్మఫిర్దోస్, అనూష, గీత, నవ్య, స్ఫూర్తి, మమత, లావణ్య, రాధిక, రజిని, కిరుపాల్ కౌర్, రాజేష్, మహేష్, లింగారెడ్డి పాల్గొన్నారు.



చిన్నారులకు జ్ఞాపికలు అందించిన ఉపాధ్యాయులు

రైతుల నుంచి బలవంతపు భూసేకరణ సరికాదు

ఖిలా వరంగల్: విమానాశ్రయం పునర్నిర్మాణం కోసం ప్రభుత్వం చేపట్టనున్న బలవంతపు భూసేకరణ సరికాదని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ ఉమ్మడి వరంగల్ జిల్లా కమిటీ సభ్యుడు రాచర్ల బాలరాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2013 భూ సేకరణ చట్ట ప్రకారం భూ నిర్వాసితులకు నష్ట పరిహారం, పునరావాసం కల్పించాలని సూచించారు. ఎయిర్ ఫోర్ట్ రన్‌వే కింద 253 ఎకరాల భూములు కోల్పోతున్న రైతులకు మార్కెట్ ధర ప్రకారం పరిహారం చెల్లించాలని కోరారు.

క్లుప్తంగా

కేయూలో సైక్లింగ్ పోటీలు



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో సైక్లింగ్ (పురుషులు) పోటీలను క్యాంపస్‌లో వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి, స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ ప్రొఫెసర్ వెంకయ్య బుధవారం ప్రారంభించారు. మహ్మద్ హబీబుద్దీన్ (ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల), ఎస్.రాకేష్ (అరుణోదయం కళాశాల), మహ్మద్ రియాజ్ (మాస్టర్జీ కళాశాల), సంజీవ్, లోకేష్ (వరంగల్ కిట్స్ కళాశాల), జి.రాజకృష్ణ (కేడీసీ) సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ పోటీల్లో పాల్గొంటారని వెంకయ్య వివరించారు.

'ఆర్ట్స్' ప్రిన్సిపాల్‌కు అభినందన

కేయూ క్యాంపస్: హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్‌గా మరో ఏడాది పాటు బాధ్యతలు స్వీకరించిన ప్రొఫెసర్ జ్యోతిని బీసీ విద్యార్థి సంఘం నాయకులు బుధవారం సన్మానించారు. కార్యక్రమంలో నాగరాజు, వంశీ, అంజీ, తదితరులు పాల్గొన్నారు.

ఫార్మసీ హాస్టల్ జేడీకి సన్మానం

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో ఫార్మసీ హాస్టల్ జాయింట్ డైరెక్టర్ ఇటీవల బాధ్యతలు చేపట్టిన కళాశాల రాజనీతిశాస్త్ర విభాగం కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సంజీవ్‌ను సామాజిక శాస్త్రాల విభాగం అధ్యాపకులు బుధవారం సన్మానించారు. కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీధర్‌కుమార్ లోథ్, భిక్షపతి, తిరుణహరి శేషు, లక్ష్మీనారాయణ, వీరస్వామి, ఐలేష్, చందులాల్, చారి, హరికుమార్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమానికి సరుకుల అందజేత



మామునూరు: హనుమకొండలోని మల్లికాంబ మనోవికాస కేంద్రాన్ని మామునూరు నాలుగు బెటాలియన్ స్పెషల్ పోలీసులు బుధవారం సందర్శించారు. కమాండెంట్ బి.రామ్‌ప్రకాశ్, అడిషనల్ కమాండెంట్ ఎంఐ సురేష్ ఆదేశాల మేరకు బియ్యం, నిత్యావసర సరుకులు, పండ్లను టీజీఎస్‌పీ కంపెనీ పోలీసులు అందజేశారు. కార్యక్రమంలో ఆర్ఐ పురుషోత్తం రెడ్డి, ఆర్ఎస్సైలు ప్రశాంత్, రుషికేష్, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

హామీలను నెరవేర్చాలి


వరంగల్: బీసీలకు ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు గురువారం జరగనున్న రాష్ట్ర క్యాబినెట్‌లో చర్చించి నిర్ణయాలు తీసుకోవాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు ఒక ప్రకటనలో కోరారు. రాష్ట్ర శాసనసభ ఎన్నికలకు ముందు కామారెడ్డి డిక్లరేషన్‌లో బీసీలకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన అన్ని హామీలను అమలు చేయాలని పేర్కొన్నారు. జనాభా ప్రాతిపదికన స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్ బిల్లును శాసనసభలో ఆమోదించి కేంద్రానికి పంపి చట్టబద్ధతకు ఒత్తిడి తేవాలని, బీసీ రిజర్వేషన్లు పెంచిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని తెలిపారు.

పోరాటయోధుడు స్టాలిన్



న్యూశాయంపేట: సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడిన యోధుడు స్టాలిన్ అని సీపీఐ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కర్రె భిక్షపతి కొనియాడారు. బాలసముద్రంలోని పార్టీ కార్యాలయంలో స్టాలిన్ వర్ధంతి సభ బుధవారం జరిగింది. ఈ సందర్భంగా స్టాలిన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎల్లేశ్, ఎం.భిక్షపతి, సంతోష్, శ్రీనివాస్, రవి, శంకర్‌నాయక్, అనిల్‌కుమార్, కనకమ్మ పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రశంస



కేయూ క్యాంపస్: హనుమకొండలోని నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన సాంస్కృతిక ఉత్సవం కల్చరల్ ఫెస్ట్‌లో ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల విద్యార్థినులు పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబర్చి బహుమతులు అందుకున్నారు. ఈ సందర్భంగా వారిని ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జ్యోతి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీదేవి, అధ్యాపకులు కళాశాలలో బుధవారం అభినందించారు.

డాక్టరేట్ గ్రహీతకు సన్మానం

దేశాయిపేట: వరంగల్ ఎల్బీనగర్‌కు చెందిన సురేందర్ ఎలువగండ్ల పీహెచ్‌డీ పూర్తిచేసి ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందారు. ఈమేరకు ఎల్బీనగర్‌కు వచ్చిన ఆయనను స్థానిక బీజేపీ నాయకులు బుధవారం సన్మానించారు. కార్యక్రమంలో సముద్రాల పరమేశ్వర్, బాకం హరిశంకర్, రఘునారెడ్డి, కె.నాగరాజు, తిలక్, రాజు, భిక్షపతి, రాజేందర్, అపురూప రజనీష్ నేత, కె.శ్రీనివాస్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకుల సహకారంతోనే ఆర్థికాభివృద్ధి

- వరంగల్ ఎంపీ కడియం కావ్య

వరంగల్: ప్రభుత్వ, ప్రైవేట్ రంగంలోని బ్యాంకులు మహిళలకు ఎలాంటి సెక్యూరిటీ లేకుండా రుణాలు అందించినప్పుడే వారు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అన్నారు. చాంబర్ కార్యాలయంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మెగా ఎంఎస్ఎంఈ అవుట్ రీచ్ సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎంపీ కడియం కావ్య, బ్యాంక్ రీజినల్ హెడ్ సత్యం పలుగుల, జీఎం గుణనంద్, డిస్ట్రిక్ట్ ఇండస్ట్రీస్ సెంటర్ జీఎం కోడం రమేష్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళా అభ్యున్నతికి అనేక వెసులుబాట్లు కల్పిస్తూ వివిధ పథకాలకు బడ్జెట్ మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. తమ వంతు సామాజిక బాధ్యతగా మహిళలను పారిశ్రామికవేత్తలుగా బ్యాంకులు తీర్చిదిద్దాలని కోరారు. సమావేశంలో చాంబర్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మాడూరి వేదప్రకాశ్, కోశాధికారి అల్లె సంపత్, చాంబర్ కార్యవర్గ సభ్యులు, వివిధ సెక్షన్ల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న ఎంపీ కడియం కావ్య

నేషనల్ యూత్ పార్లమెంట్ పోస్టర్ల ఆవిష్కరణ



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వీసీ, తదితరులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో నేషనల్ యూత్ పార్లమెంట్ వాల్‌పోస్టర్లను రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రామచంద్రంతో కలిసి అకడమిక్ కమిటీ హాల్‌లో వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ దేశ అభివృద్ధిలో యువత కీలకపాత్ర పోషించాలని సూచించారు. 18 నుంచి 25 ఏళ్ల వయస్సు గల యువత ఈనెల 9లోపు మై భారత్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. జిల్లాలో 10మంది ఉత్తమ విద్యార్థులను ఎంపిక చేసి రాష్ట్ర యూత్ పార్లమెంట్‌కు పంపనున్నట్లు వివరించారు. అందులో ప్రతిభ చూపిన వారిని జాతీయస్థాయి యూత్ పార్లమెంట్ కోసం ఢిల్లీకి పంపుతారని అన్నారు. కార్యక్రమంలో యూనివర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ మనోహర్, వైస్ ప్రిన్సిపాల్ మమత, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఈసం నారాయణ, నెహ్రూ యువకేంద్రం డిప్యూటీ డైరెక్టర్ అన్వేష్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు రాధిక, సుజాత, సునీత తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డు సమస్యను పరిష్కరించండి

మడికొండ: మడికొండ – రాంపూర్ గ్రామాల మధ్య ఉన్న డంపింగ్ యార్డు సమస్యను పరిష్కరించాలని అడ్‌హక్ కమిటీ సభ్యులు కోరారు. ఈమేరకు టేకుల గూడెంలోని స్వగృహంలో ఆయిల్, సీడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డికి బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ డంపింగ్ యార్డుతో పలు గ్రామాల ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. అనంతరం, వరంగల్ పశ్చిమ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అడ్‌హక్ కమిటీ సభ్యులు తాటిరెడ్డి కరుణాకర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు జోరిక రమేష్, తొట్ల రాజుయాదవ్, దువ్వ నవీన్, గడ్డం మహేందర్, భిక్షపతి, ఈదురు అనిల్, పులి రజినీకాంత్, పానగోటి వెంకట్‌రావు, రవి, దువ్వ శ్రీకాంత్, పెండ్లి కృష్ణమూర్తి పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న కమిటీ సభ్యులు

విద్యార్థులు కీలక పాత్ర పోషించాలి



విద్యార్థికి అవార్డు ప్రదానం చేస్తున్న అతిథులు

న్యూశాయంపేట: శాంతియుత సమాజం కోసం విద్యార్థి దశ నుంచే విద్యార్థులు కీలక పాత్ర పోషించాలని వరంగల్ జిల్లా వరల్డ్ పీస్ ఫెస్టివల్ సొసైటీ జనరల్ సెక్రటరీ మండల పరశురాములు సూచించారు. వరంగల్ జక్కలొద్ది మైనారిటీ బాలుర గురుకులంలో వరల్డ్ పీస్ ఫెస్టివల్ కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం, కమ్యూనికేషన్‌ను ప్రోత్సహించడం, గురువులను గౌరవించడం, నైపుణ్యాలను పెంచుకుంటే శాంతియుత జీవనాన్ని కొనసాగించవచ్చని అన్నారు. అనంతరం బాలశాంతి దూత అవార్డులను విద్యార్థులు రాహుల్‌రెడ్డి, ఎస్‌కే.అర్షద్‌పాషాకు ప్రదానం చేశారు. ప్రిన్సిపాల్ భిక్షపతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కోఆర్డినేటర్ శివాజీ, ఉపాధ్యాయులు కల్యాణి, షాహిన్‌బేగం తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

మార్కెట్ ఏర్పాటుకు కృషి చేయాలి

హసన్‌పర్తి: లష్కర్‌సింగారం రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 266లో మార్కెట్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ప్రజాతంత్ర ఆలోచన వేదిక, కాలనీ వాసులు కోరుతున్నారు. ఈమేరకు ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వేదిక సభ్యులు మాట్లాడుతూ 7.36 ఎకరాల భూమిలో మార్కెట్ నిర్మించాలని కలెక్టర్ ఆదేశాలు జారీచేసి ఏడాది అవుతున్నా ఇప్పటివరకు సర్వే చేయడానికి రెవెన్యూ అధికారులు రాలేదని ఆరోపించారు. కార్యక్రమంలో ప్రజాతంత్ర ఆలోచన వేదిక అధ్యక్షుడు తుపాకుల దశరథం, కన్వీనర్ పింగిలి అశోక్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు మీసాల రమేష్, సభ్యులు సారంగపాణి, వేణుగోపాల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బస్‌షెల్టర్ ఏర్పాటు చేయండి

హసన్‌పర్తి: హనుమకొండ – కరీంనగర్ ప్రధాన రహదారిలోని ఎర్రగట్టు జంక్షన్ వద్ద బస్‌షెల్టర్ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరారు. ఈమేరకు స్థానిక ఎమ్మెల్యే కేఆర్.నాగరాజుకు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బస్‌షెల్టర్ లేకపోవడంతో విద్యార్థులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు ఎదుర్కొంటున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక యూత్ కాంగ్రెస్ నాయకుడు కర్నాల అభినేష్ పటేల్, నాయకులు పాల్గొన్నారు.

నామినేటెడ్ పోస్టుల్లో అవకాశం ఇవ్వాలి

కాజీపేట: రాష్ట్రస్థాయిలో నామినేటెడ్ పోస్టుల భర్తీలో అవకాశం తనకు కల్పించాలని కాజీపేట పట్టణానికి చెందిన ఎండీ.రహమతుల్లా కోరారు. ఈమేరకు ఎమ్మెల్సీ బల్మూరు వెంకట్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు.

పండ్ల వ్యాపారుల సంఘం అధ్యక్షురాలు మృతి

హసన్‌పర్తి: 66వ డివిజన్ పండ్ల వ్యాపారుల సంఘం అధ్యక్షురాలు, మాజీ వార్డు సభ్యురాలు బల్సుకూరి వనక్క(70) గుండెపోటుతో బుధవారం మృతి చెందారు. మృతురాలికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. పెద్ద కుమారుడు బల్సుకూరి శ్రీనివాస్.. హసన్‌పర్తి ఉప సర్పంచ్, దేవస్థాన చైర్మన్‌గా వ్యవహరించారు. వనక్క మృతిపై స్థానిక కార్పొరేటర్ శివకుమార్, కాంగ్రెస్ నేత నమిండ్ల శ్రీనివాస్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు శ్రీధర్, పలువురు నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

క్రైస్తవుల ఉపవాస ప్రార్థనలు ప్రారంభం

కాజీపేట రూరల్: క్రైస్తవుల 40 దినాల ఉపవాస ప్రార్థనలు బుధవారం ప్రారంభమైనట్లు గెత్సెమనే థియోలజికల్ బైబిల్ కాలేజ్ కరుణాపురం రెవరెండ్ డాక్టర్ జె.థామస్ తెలిపారు. ఈస్టర్ పండుగకు ముందు 40 రోజుల పాటు క్రైస్తవులు ఉపవాస దీక్షలో ఉంటూ ఆయా ప్రార్థన మందిరాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేస్తారని వివరించారు.

'శ్వేతార్క'లో పుత్ర గణపతి వ్రతం



కాజీపేట: కాజీపేట స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రంలో పుత్ర గణపతి వ్రతాన్ని బుధవారం నిర్వహించారు. ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకుడు అయినవోలు సాయికృష్ణ శర్మ ఆధ్వర్యంలో అర్చకులు పుత్ర గణపతి వ్రతం చేయించారు. ప్రధాన అర్చకుడు రాధాకృష్ణ శర్మ.. గణపతి హోమం జరిపించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం అన్నపూర్ణ భవనంలో అన్నదానం చేశారు.

నాణ్యమైన విద్యుత్ అందించాలని ధర్నా



వరంగల్: వ్యవసాయానికి నాణ్యమైన కరెంటు సరఫరా చేయాలని రైతులు డిమాండ్ చేశారు. ఈమేరకు ఆరెపల్లి ప్రధాన రోడ్డులో కొత్తపేట క్రాస్ వద్ద ఆ గ్రామ రైతులు బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్ సరఫరాలో హెచ్చుతగ్గులతో మోటార్లు కాలిపోతున్నాయని వాపోయారు. కాగా, విషయం తెలిసిన వెంటనే అదనపు ట్రాన్స్‌ఫారాన్ని ఏర్పాటు చేసినట్లు రైతులు తెలిపారు.

చికెన్, గుడ్లు తింటే ఏ హానీ కలగదు



వరంగల్: చికెన్, కోడి గుడ్లు తింటే ఎలాంటి హానీ కలగదని 22వ డివిజన్ కార్పొరేటర్ బస్వరాజు కుమారస్వామి అన్నారు. దేశాయిపేట 80ఫీట్ల రోడ్డు జంక్షన్ వద్ద రాంరెడ్డి చికెన్ మార్కెట్ ఏర్పాటు చేసిన చికెన్ మేళాలో 300కిలోల చికెన్, 2వేల కోడి గుడ్లను ప్రజలకు బుధవారం ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చికెన్, గుడ్లు తింటే బర్డ్‌ఫ్లూ వస్తుందని సోషల్ మీడియాలో వస్తున్న ఆరోపణలను నమ్మొద్దని అన్నారు. కార్యక్రమంలో చికెన్ సెంటర్ యజమాని రాజేష్, కంపెనీ ఏజీఎం జ్ఞానశేఖర్, మార్కెటింగ్ మేనేజర్ స్వామి, చైతన్య కుమార్ రెడ్డి, జన్ను భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.